# బాలమిత్ర

**- వాసంతి మాఘుపు.**

**పద్యము: బలవంతుడ నాకేమని**
**పలువురితో నిగ్రహించి పలుకుట మేలా**
**బలవంతమైన సర్పము**
**చలిచీమలచేత జిక్కి చావదె సుమతీ!**

**అర్థం:** నేను బలవంతుడను, విద్యావంతుడను అని గర్వముచే సంచరించరాదు. అపుడు జనులు విరోధము తెచ్చి కించపరచక మానరు. బలమైన పాము కూడా చలిచీమలచేత చిక్కి ప్రాణములు కోల్పోవును కదా! ఎంతవారికైనను గర్వము తగదు. గర్వము వ్యక్తిని పాతాళమునకు నెట్టివేయును.

**పద్యము:** ***ప్రియములేని విందు పిండివంటల చేటు***
***భక్తిలేని పూజ పత్రి చేటు***
***పాత్ర మెఱుగనీవి బంగారు చేటురా***
***విశ్వదాభిరామ! వినురవేమ!***

**ప్రియము** = ఇష్టము
**పత్రి** = పూజకు ఉపయోగించే ద్రవ్యము

**అర్థం:** ప్రేమలేని అన్న సంతర్పణము నందు పిండివంటలు వ్యర్థము. దేవునిపై దృష్టిలేని పూజకు ఉపయోగించే పత్రి వ్యర్థము. అదే రీతిన అపాత్రత గల దానిచ్చి సొమ్ములు (ఆభరణములు) చేయమంటే బంగారము వన్నె తగ్గును.

* * *

**పద్యము: సరుకులు బట్టలు వన్నెల**
**కరవులు తేదగదు తెచ్చెనేని సరకు ల**
**క్కర దీర్చుకొనిన వెంటనె**
**మరలింపకయున్న దప్పు మాట కుమారీ!**

**అర్థం:** బడాయికి యెవరివైన నగలను, బట్టలను ఎరువు తేకూడదు. నీకున్నదొక ముక్కుపుడక కంటె కాసులపేరయినను గౌరవము కాదు. ఒకవేళ తెచ్చినను వెంటనే ఇచ్చి వేయకున్నచో చాలా కష్టములున్నవి.

## పదమేంటో చెప్పుకోండి!

క్రింద ఇచ్చిన ఆధారములనుపయోగించి పదమేంటో చెప్పుకోండి!

1. ఇది 5 అక్షరముల ఊరి పేరు.
2. చివరి రెండు అక్షరములు 'కోటప్పకొండ' మొదటిలో ఉన్నాయి.
3. మొదటి మూడు అక్షరములు సప్త స్వరములలోని అక్షరముల గుణింతములతో, వత్తులతో ఏర్పడతాయి.
4. ఆంధ్రప్రదేశ్‌లో ఇది ఒక జంక్షన్.

**ఏమిటా పదము?**

(సమాధానములు వచ్చే సంచికలో)

జనవరి 2010 సంచికలోని **'పదమేంటో చెప్పుకోండి!'**

**ఉదయగిరి.**

**సామెతలు:**

ఆవు చేల్లో(చేనులో) మేస్తే - దూడ గట్టునమేస్తుందా?
ఉట్టికి ఎగరలేనమ్మ స్వర్గానికి నిచ్చెనవేసినట్లు.

**పొడుపు కథలు:**

కోట్లు పోసినా నన్ను కొనలేరు.
నాలేమి అనారోగ్యహేతువు.
రాజుకైనా, పేదకైనా నేను ఒకటే.
స్వామివారికైనా పవళింపు సేవ జరిపిన తరువాత
నా ఒడిలో సేదతీరుతున్నట్లే తలపోయాలి.
ఆవులింత నా పిలిపుకు గుర్తు.
నేనెవరిని? (నిద్ర)

*తప్పు- ఒప్పు: భాద అని వ్రాయడం తప్పు. బాధ అని వ్రాయడం ఒప్పు.*

# నూతిలో కప్ప

*(ఈ కథను వివరించిన రచయిత పేరు తెలియదు. కాని చక్కని బొమ్మలతో ఈ శీర్షికను తీర్చిదిద్దిన ఆ రచయితకు ధన్యవాదములు.)*

ఒకానొకప్పుడు పర్వతపాదాలు సముద్రపు అంచులను తాకుతున్నట్లున్న ప్రదేశములో ఒక చిన్న ఊరు ఉండేది. ఆ పల్లె ఎన్నాళ్ళుగానున్నదో ఎవరికీ తెలియదు, కానీ రాతి కట్టడములు, ఇంటి పైకప్పు నిర్మాణములను బట్టి ఆ పల్లె కొన్ని తరాలుగా అక్కడ ఉన్నట్లు తెలుస్తుంది.

ఆ పల్లె పచ్చని పైరులతో కళకళలాడుతుంటే, ఆ ఊరిలోని స్త్రీలు నూతినుండి నీటిని తీసికొని పోతూ అదీ-ఇదీ ముచ్చటించుకోవడం పరిపాటి. అయితే వీళ్ళెవరికీ ఆ నూతిలో ఒక కప్ప చాలా కాలముగా నివసిస్తున్నదన్న విషయం తెలియదు.

ఆ కప్ప చిరుకప్పగా నున్న రోజులలో ఒక పక్షి దానిని ముక్కున కరుచుకుపోతూ అందులో జారవిడిచింది. ఆ కప్పకు ఆ నూతిలో నున్న భాగమే తెలుసు. అదే దాని ప్రపంచము. దానికి ఆ నూతి వెలుపల ఒక ప్రపంచమున్నదన్న విషయము తెలియదు; అప్పుడప్పుడు కనిపించి, కొద్దిసేపట్లో కనుమరుగయ్యే బాల్చీలు(బకెట్స్) తప్ప. కాని ఆ కప్ప ఎప్పుడూ ఆ బాల్చీ ఎక్కడినుండి వచ్చింది? ఎక్కడికి పోయింది? అని ఆలోచించనేలేదు.

ఒక రోజు వర్షం మొదలయ్యింది. ఆ వర్షం అలా చాలా రోజులు కురిసి కురిసి - నీరు వరదలుగా పారసాగింది. అప్పుడే మరొక కప్ప ఆ నూతిలో పడింది. అయితే ఆ కప్ప నది సముద్రములో సంగమించేచోట నివసించేది. వర్షముల కారణముగా నది పొంగి, ఆ కప్ప వరద తాకిడికి కొట్టుకొని వచ్చి, ఆ నూతిలో తలదాచుకోడానికి దానిలో దుమికింది.

"ఓ ప్రియ నేస్తమా!" అంటూ ఆశ్చర్యముతో ఆ నూతిలోని కప్ప ఇలా ప్రశ్నించింది "ఎక్కడినుండి వచ్చావు? నేనిదివరకు నా బావిలో నిన్ను చూడలేదు."

"నేను నది సముద్రములో కలిసే చోట నివసిస్తుంటాను. ఎడతెరపిలేని వర్షమువలన నది పొంగి, నీటిలో కొట్టుకుని ఈ నూతిని చేరాను. వర్షము తగ్గేవరకు నేనిక్కడ ఉండవచ్చా?" అని ప్రశ్నించింది అతిథి కప్ప.


"నీకిష్టమొచ్చినంత కాలము ఉండవచ్చు." అన్నది నూతికప్ప గర్వముతో. "నీవు చూస్తున్నావుకదా! ఈ నుయ్యి నాది. చాలా విశాలమైనది, అందమైనది. నీకు కావలసినంత ప్రదేశము ఇక్కడ ఉంది. ఇంతవరకు నాకు అతిథులెవరూ రాలేదు. నీతో గడిపే అవకాశము కలిగినందుకు చాలా ఆనందముగా నున్నది." అన్నది నూతికప్ప.

తరువాత నూతికప్ప తినడానికి కొన్ని క్రిములను సేకరించి అతిథికి మర్యాద పూర్వకముగా అందించింది. త్వరలోనే మాటామాటా కలిసి, చాలాకాలముగా తప్పిపోయిన తోబుట్టువుల వలె - మళ్ళీ కలుసుకున్నందుకు హర్షమును వ్యక్తముచేస్తూ గడిపాయి.

కొంతసేపటి తరువాత నూతికప్ప అతిథిని ఉద్దేశించి "నీవు ఇందాక ఏదో నది, సముద్రము అని ప్రస్తావించావు కదా! అవి ఏమిటి?" అని ప్రశ్నించింది.

"నేను తరుచుగా అన్నిటినీ పరిశోధిస్తూ ఉంటాను. ఆ విధముగా తెలుసుకున్నది ఏమిటంటే, నేను నివసించే

నది - ఎన్నో పిల్ల కాలువల కలయిక వలన ఏర్పడుతుంది. అలాంటి ఒక కాలువ ఈ బావిని నింపుతున్నది. ఈ నీటి రుచివలన నాకా విషయము తెలిసింది." అన్నది అతిథి కప్ప.



"Beyond all this lies a great river and a vast sea."

"అయితే ఈ నూతిలోని నీరు నదినీరేనన్న మాట. మరి సముద్రము సంగతేమిటి?" అని ప్రశ్నించింది నూతి కప్ప.

"అది ఎంతో విశాలమైనది. ఎంత విశాలమంటే - నేను ఈదగలిగిన దానికంటే ఎన్నో రెట్లు పెద్దదైన నీటి సమూహము. అక్కడ నీరు కూడా వేరే రుచి కలిగి ఉంటుంది."

"అది నీ నూతికంటే లోతై ఉండదు" అంటూ నూతికప్ప నూతి అడుగుభాగానికి చేరి కొన్ని నిమిషముల తరువాత పైకి వచ్చింది.

"అది నూతికంటే చాలా చాలా లోతు." అంటూ నవ్వింది అతిథికప్ప.

"అది నా నూతికంటే వెడల్పు అయి ఉండదు." అన్నది నూతికప్ప, తనని చూస్తూ అతిథి కప్ప నవ్వినందుకు నొచ్చుకుంటూ.

"అది ఎంత వెడల్పో నేను నీకు చెప్పలేను. అది ఎంత వెడల్పు ఉందో చెప్పడానికి - ఇక్కడ సరితూచడానికి ఏమీ లేదు." అన్నది అతిథి కప్ప.

"నీవు అబద్ధాలకోరువి. ఈ నూతికంటే పెద్దదైనదేదీ ఉండే అవకాశమే లేదు. ఈ నదులు, సముద్రాల మాటలన్నీ అర్థం లేనివి. నా నూతినుండి వెంటనే వెళ్ళిపో" అని మర్యాదలన్నీ మరచిపోయి, కోపముతో

**ఊగిపోతూ అన్నది నూతి కప్ప.**

**అతిథి కప్ప ఎంతో విచారించింది, కాని ఆ నూతినుండి బయటికి వచ్చేయడమే సముచితమని భావించింది. అదృష్టముకొద్దీ వర్షముకూడా ఆగిపోయింది. అతిథికప్ప తన నివాసమైన నది-సముద్రము కలిసేచోటికి చేరింది. నూతికప్పయొక్క పరిమితమైన దృష్టిని మార్చడం కష్టమని అతిథి కప్పకు తెలుసు.**

*దీనివలన నేర్చుకున్న నీతి ఏమిటి?*

*వాస్తవాలు చాలా సందర్భములలో జీర్ణించుకోడానికి చేదుగా ఉంటాయి. ఎదురివారి మాటలలో సత్యము ఎంత ఉందో శోధనచేసి తగు నిర్ణయం తీసుకోవాలి. మనము నమ్మినదే పరమ సత్యమని, ఎదుటివారి మాటలు కల్లలని - విచక్షణారహితంగా నిర్ణయించుకోవడం తగదు. వినదగు నెవ్వరు చెప్పిన, వినినంతనె వేగపడక వివరింపదగున్ అన్నాడు సుమతీ శతకకారుడు. వంపుకర్రగాచి వంపుతీర్చగవచ్చు, కొండలన్ని పిండిగొట్టవచ్చు, కఠినచిత్తు మనసు కరిగింపగారాదు అన్నాడు వేమన.*

*

**కథలోని అతిథి కప్ప నివాసమునకు దారి చూపించరూ!**

